# నా రాధ

**శ్రీమతి చిల్లరిగె సామ్రాజ్యలక్ష్మి**

వాకిట్లోంచి యింట్లోకి, యింట్లోంచి వాకిట్లోకి కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నానంటే నమ్మండి. ప్రొద్దుట అంతగ పూరించి వెళ్ళాడు అన్నయ్య సినిమాకు సిద్ధంగా వుండమని. మాటలయితే బాగా చెప్తాడు. క్రియ శూన్యం. సాయంత్రం ఆరు గంటలు కొట్టారు. గడియారం గంటలు టంగ్ టంగ్ మంటూంటే నా గుండెమీద కొట్టినట్లుంది. నాకు తెలియకుండానే నాలో ఏదో తొందర, అన్నయ్యమీద చెప్పలేనంత కోపం వచ్చింది. కాని ఏం చెయ్యగలను? పోనీ ఏదో చెత్త పిక్చర్ అనుకుందామన్నా వీల్లేదు. "కోవాడిస్". ఫస్టుక్లాస్ పిక్చరనే చెప్పాలి. ఇవాళే ఆఖరు రోజు కావాలా చెప్పండి? తిరిగి తిరిగి నా కాళ్ళు నొప్పులు పుట్టి వచ్చి తిన్నగా సోఫాలో కూర్చున్నా. ఇంతలో సైకిల్ గంట, కాలి బూట్ల చప్పుడు వినిపించాయి. టైం 6—15. పిక్చరు ఆరున్నరకు మొదలుపెడ్తారు. ఇప్పటికైనా ఆఫీసునుంచి వూడి పడ్డందుకు చాలా సంతోషించాను.

"అరె! మర్చిపోయాను నిర్మలా!" అన్నాడు. "కబుర్లు చెప్పక త్వరగా కానీయవోయ్ బ్రదర్" అన్నాను. మరయిదు నిమిషాల్లో హాలు చేరుకున్నాం. దేవుడి దయవల సినిమా మొదలుపెట్టలేదు. మేము కూర్చున్న కుర్చీలకు ముందు కుర్చీలలో కాలేజి అమ్మాయిలు కాబోలు సుమారు ఇరవై మంది దాకా వున్నారు. అందులో ఒక అమ్మాయిపేరు రాధ కాబోలు "రాధా! ఈ ప్రక్కకు రావే" అని ఒకమ్మాయి కేక పెట్టింది. రాధ అన్న అమ్మాయి యిటువచ్చి కూర్చోడం రెండు నిమిషాల్లో జరిగిపోయింది. రాధ పేరు వినంగానే నా రాధ జ్ఞాపకంవచ్చింది. రాధ గురించి క్షణంసేపు ఆలోచించాను. ఎక్కడుందో! ఏం చేస్తోందో నా రాధ. ఒక చిన్న కాలువలో కాయితపు పడవ ఆ ప్రవాహానికి కొట్టుకు పోతుంటే చిన్న రాయి అడ్డుపడి ఆగిపోయినట్లుగా నా మనస్సనే చిన్న పడవ ఆలోచనలాంటి ప్రవాహంలో కొట్టుకు పోతోంటే రాయి అడ్డుతగిలి ఆగిపోయినట్లు లైట్లు ఆర్పడం, సినిమా మొదలుపెట్టడంవల్ల నా ఆలోచనలకు బ్రేక్ పడ్డది. సినిమా చూస్తున్నంత సేపు ఆ రోమ్ పట్టణంలో వున్నట్టు, అంతా నిజంగా జరుగుతున్నట్లనిపించింది. నిజంగా ఆ రాజుకు వేపకాయంత వెర్రివుంది. నా తెలివి వేపకాయంత ఏమిటి? గుమ్మడి కాయంత వుంది ఖచ్చితంగా! సినిమా వదిలారు. దారిలో వన్నూ రోమ్ పట్టణాన్ని గురించి, నీరో రాజును గురించి వాదు లాడుకుంటూ యిల్లు చేరుకున్నాం. పాపం! అమ్మ మా కోసం తను కూడా భోంచేయకుండా కాచుకుని కూర్చుంది. ముగ్గురం అన్నాలు తిన్నాం. నాన్నగారు, చెల్లి, తమ్ముడు గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. పడుకున్నాక రాధ తిరిగి నా మనో మందిరంలో ప్రవేశించింది.

సరిగ్గా ఆరేళ్ళ క్రిందటినాటి ముచ్చట. నేను ఫస్టు ఫారం చదివే రోజుల్లో మా యింటి ఎదురింటికి ఒక తల్లి,కూతురు వచ్చారు. రెండుమూడు గంటల్లో నేను, ఆ అమ్మాయి ఆప్త స్నేహితులం అయ్యాం. తల్లి చాలా మంచిది. అమాయకురాలు. నా దుడుసుతనానికి క్రొత్త అమ్మాయి రాధ మంచితనానికి స్నేహం ఎలా కుదిరిందో! నిజంగా అక్క చెల్లెళ్ళలా మెలిగేవాళ్ళం. ఎక్కడకు వెళ్ళినా యిద్దరం కలిసి వెళ్ళవలసిందే. ప్రొద్దుటే నిద్దరలేచి పాల చెంబు పట్టుకుని వాళ్ళ యింటికి పాలకోసం తను, మా యింటి పాలకోసం నేను బయలుదేరే వాళ్ళం. దారిలో రోడ్డుమల్లెపూలు (వాటినే పున్నాగ పువ్వులని కూడా అంటారు) అవన్నీ గుత్తులు గుత్తులుగా పోగుచేసి చేతో పట్టుకునే వాళ్ళం. ఏమిటో పిచ్చిగాని ఆ రోజుల్లో అదో సరదా. అందరూ మమ్మల్ని అక్క చెల్లెళ్ళా అని అడుగు తుండేవారు. ఒకరోజు సంఘటన చాలా బాగా గుర్తుంది నాకు. స్కూలు నుంచి వస్తున్నాం. దారిలో మాటా మాటా వచ్చి కోపం పట్టలేక రాధ చెంపమీద చెళ్ళున కొట్టాను. రాధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాని ఆశ్చర్యం! నన్ను తిరిగి ఒక్క మాటైనా అనలేదు. అదే యింకో పిల్లయితే తిరిగి నా చెంపకాయ కొట్టేదే. ఆ రాత్రి పడుకున్నాక నేను చేసిన పని చాలా తప్పని తెలుసుకుని చాలా బాధ పడ్డాను. ఎంతగానో ఏడ్చాను. ఎప్పు డెప్పుడు తెల్లారు తుందా, ఎప్పుడు రాధను క్షమాపణ అడుగుదామా అని కాచుకున్నాను. తెల్లారింది. రాధ రెండు చేతులూ పట్టుకుని క్షమించమని అడిగాను. ఎంతో శాంతంతో నన్ను ఓదార్చింది. తిరిగి స్నేహితుల మయ్యాం. రోజూ క్లబ్బుకు వెళ్ళే వాళ్ళం. అక్కడకు చాలా మంది తల్లులు తమ పిల్లలతో సహా వచ్చేవాళ్ళు. కాని అందరిలోను మా యిద్దరకు నచ్చినది ఆ రెండు జడ అమ్మాయే. ఆ అమ్మాయి కలెక్టరుగారి అమ్మాయని మాత్రం తెలుసుకున్నాం. ఆ అమ్మాయంటే చాలా యిష్టంగా వుండేది. మేము చీకటి పడేవరకు ఇసుకలో ఆడడం, కొంచెం వెలుతురుండగానే బ్యాడ్మింటన్ కోర్టులో పాటరయి వాళ్ళు ఆడి అక్కడ పెట్టిన బ్యాట్లతో మేము ఆట సాగించేవాళ్ళం. కొన్ని రోజులనుండి నన్నూ, రాధను పూరికే ఎందుకో చూస్తుండేది. మేము ఎక్కడకెళ్ళితే తను అక్కడకు వచ్చేది. ఆ అమ్మాయి వైపు అదేపనిగా చూస్తే ఏమనుకుంటుందో ఏమో అని మేము చూడటం మానేశాం. కొన్ని రోజుల తరువాత నేనూ, రాధ ఒకళ్ళ భుజాల మీద ఒకళ్ళు చేతులేసుకుని క్లబ్ లో తిరుగుతున్నాం. ఉన్నట్లుండి మా యిద్దరి భుజాల మీద ఏవో కొత్త చేతులు వ్రాలినట్లు గ్రహించి ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నాం. వెనక్కు తిరిగి చూస్తే ఆ రెండు జడ అమ్మాయి మా యిద్దరి భుజాల మీద చేతులేసి దర్జాగా నుంచుంది. పోలీసు చేతుల్లో పడ్డ దొంగల్లాగ బిత్తరపోయి ఒకరి మొహాలు ఒకరు చూసుకోడం మొదలుపెట్టాం. "అమ్మాయిలూ మీ నాన్నగారు మద్రాసులో వకీలు కదూ—" అని అడిగింది. మా రాధ అసలే పిరికిది. తెల్లబోయి నా మొహం చూడడం మొదలుపెట్టింది. నేను ధైర్యంచేసి "ఔనండీ!" అన్నాను. "అయితే మీరు అక్కచెల్లెళ్ళు కారూ! ఎంతోకాలం నుండి మిమ్ములను చూస్తుంటే నా కెంతో ఆనందంగా వుంది. మీతో స్నేహం చేయాలని వుంది. నాతో స్నేహం చేయడం మీ కిష్టమేనా?" అంది. మాకు యింకేం కావాలి? మేము కోరుకునేది అదేగా. మమ్మల్నిఒక్కసారిస్వర్గంలోకితీసుకెళ్ళినట్లుభావించాం.



"కోపం పట్టలేక రాధ చెంపమీద చెళ్ళున కొట్టాను"

రెండు జడల అందమైన అమ్మాయి! అందులో కలెక్టరుగారి కూతురు! కార్లో తిరిగే అమ్మాయి మాతో స్నేహం చేయడం. ఎంత దర్జా! ఆ రోజు మొదలు రోజూ స్కూలుకు వెళ్లేటప్పుడు నా రాధ ను ఇద్దరినీ ఎక్కించుకుని తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు మన ఇళ్లదగ్గర వారిని దింపి వెళ్లేది. మా యిద్దరివి ఎన్నో ఫోటోలు తీసుకుంది. ఇలా కాలం గడచిపోతున్నది. పెద్ద పరీక్షలు దగ్గర కొచ్చాయి. వచ్చేది ఎండాకాలం. సెలవు లిస్తారు. హాయిగా వుండవచ్చును. కాని రాధకు, నాకు చాలా దిగులుగావుండేది. ఎందుచేత అంటారేమో! పరీక్ష అవగానే రాధ వాళ్లమ్మగారితో తెనాలి వాళ్ల బాబాయిగారి వూరు వెళ్తుతుంది. పరీక్షలలో కష్టపడి చదివి దిట్టంగా రాశాం. ఇక వారం రోజులలో వుంది నా రాధ ప్రయాణం. నాకు చెప్పలేనంత దిగులు. కాని ఏమి చేయగలను? క్లాసులో ఒక మూలను కూర్చున్నాం. తిన్నగా, ఆ రెండు జడల అమ్మాయి మా దగ్గరకు వచ్చి కూర్చుంది. "అలాగ వున్నారేం?" అంది.

వారంరోజులలో రాధ వూరికి వెళుతున్నదని చెప్పాను. తనూ ఎంతో విచారించింది. ఒక రోజున వా ళ్లింటికి రమ్మనమని ఆహ్వానించింది. వెళ్లాము. గంట నిమిషంలా గడిపాము. వాళ్ల తోటంతా చూపించింది. ఇద్దరం ఆ రెండు జడ అమ్మాయికి గుడ్‌బై చెప్పి బయటకు వచ్చాం. రాధ ప్రయాణం రోజులు, తర్వాత గంటలు, తర్వాత నిమిషాలు గడచిపోయాయి. బండి వాకిట్లోకి వచ్చి నిలబడింది. రాధ తుదిసారి నా దగ్గరకు వచ్చి "అదృష్టముంటే మళ్ళీ కలుసుకుందాం. లేకపోతే యిదే తుదిసారి" అంటూ నన్ను పట్టుకుని బావురు మంది. నేనూ అదే పని చేశాను. జ్ఞాపకార్థం ఒకరి పెన్నులు ఒకళ్లం మార్చుకున్నాం. బండెక్కుతుంటే మంచి గులాబీ పువ్వు ఒక టిచ్చాను. దాన్ని ఎంతో ప్రేమతో యిచ్చాను. నా కన్నీటి తెరలో, రాధ బండి, అన్నీ మసకగా కనిపించాయి. బండి కొన కనిపించేవరకూ వాకిట్లోనే నుంచున్నాను. కొన్నాళ్ల వరకు రాధను మరువలేక పోయాను. ఆ తర్వాత నిజం చెప్పొద్దూ! రాధ నా మనో మందిరం దాటి చాలా దూరం వెళ్లిపోయింది. మళ్ళీ నిన్న ఆ కాలేజీ అమ్మాయి ధర్మమా అని రాధ నన్ను తన తలంపుకు తెచ్చుకుంది. అలాగా రాత్రి ఎంతకూ నిద్ర పట్టలేదు. ఒక గంట కొట్టారు. కునుకుపట్టింది. కలలో రాధతో ఆడుతూ పాడుతూ గడిపాను. రాధా, రాధా అని కేకలు వేశాను. ఇంతలో అమ్మ "తెల్లారి ఎనిమిది గంటలయినా నిద్దరేమిటే? రాధా! రాధా! అంటూ పలవరించావ్" అంది. అమ్మ అన్నట్టు నిజంగా ఎనిమిది గంటలూ అయింది. గబగబ మొహం కడుక్కోటానికి బాత్ రూమ్‌లోకి దారి తీశాను. ఎన్నాళ్లయిందో రాధను చూసి. ఏమి చేస్తున్నదో రాధ!

